జనవరి 6, 7న గ్రూప్-2

- కసరత్తు ప్రారంభించిన టీఎస్‌పీఎస్సీ
- జనవరి 6, 7 తేదీల్లో పరీక్ష
- పరీక్ష నిర్వహణపై కమిషన్ భేటీ
- ఏర్పాట్లపై కలెక్టర్లకు సూచనలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి సంబంధించి పరీక్ష నిర్వహణపై టీఎస్‌పీఎస్సీ కసరత్తు ప్రారంభించింది. జనవరి 6, 7 తేదీల్లో నిర్వహించబోయే ఈ పరీక్ష నిర్వహణపై నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సోమవారం కమిషన్ సమావేశమైంది. పరీక్ష నిర్వహణ తదితర అంశాలపై చర్చించింది. గ్రూప్-2 పరీక్షను ఈ ఏడాది ఆగస్టు 29, 30న నిర్వహించాల్సి ఉన్నది. అభ్యర్థుల కోరిక మేర కు పరీక్షను కమిషన్ వాయిదా వేసి, నవంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అయితే, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో మరోసారి వాయిదా పడింది. జనవరి 6, 7 తేదీల్లో పరీక్షను నిర్వహిస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహణ, వసతులు, నిబంధనలు తదితర అంశాలపై 33 జిల్లా కలెక్టర్లకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితారామచంద్రన్ పలు సూచనలు చేశా రు. ఇంతకుముందు గుర్తించిన పరీక్ష కేంద్రాల్లోనే పరీక్షలు జరుగుతాయని, అందులో మార్పులు, చేర్పులుంటే తమకు తెలియజేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండాలని, అక్కడే కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ తెరిచి పంపిణీ చేయాలని, ఓఎంఆర్ షీట్లు లెక్కించడం, ప్యాక్ చేయడం, సీల్ వేయడం వంటివన్నీ జరగాలని వివరించారు. పరీక్ష కేంద్రాలను ఈ నెల 7లోగా ఫైనల్ చేసి, టీఎస్‌పీఎస్సీకి నివేదించాలని ఆదేశించారు.

సాగర్ సాకుతో ప్రాజెక్టుల స్వాధీనం

- ఏపీని ఎగదోసి పావులు కదుపుతున్న కేంద్రం
- రివర్‌బోర్డు గెజిట్ అమలుకు ప్రయత్నాలు
- ఆది నుంచీ అదే కోరుకుంటున్న ఏపీ సర్కారు
- ఆపరేషన్ ప్రొటోకాల్ తరువాతేనంటున్న తెలంగాణ



ఏపీని ఎగదోసి?

నీటి పంపకాలు పూర్తికాకుండా బోర్డుల పరిధిలోకి ప్రాజెక్టులను అప్పగించేందుకు తెలంగాణ మొదటి నుంచీ ససేమిరా అంటున్నది. ఏపీ మాత్రం మొదటి నుంచీ అందుకోసం పట్టుబడుతున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల ఎవరూ ఊహించని రీతిలో ఏపీ ప్రభుత్వం సాగర్ డ్యామ్‌ను ఆక్రమించింది. దీనివెనక కేంద్రమే పావులు కదిపిందని ఇంజినీర్లు అనుమానిస్తున్నారు. ఇదే అదునుగా ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకురావాలని చూస్తున్నదని అంటున్నారు. 'నీటిని కూడా ప్రాజెక్టుల వారీగా కేటాయించలేదు. అలాంటప్పుడు బోర్డులు ఎలా పర్యవేక్షిస్తాయి. ఎక్కడి నుంచి ఏ ప్రాంతానికి, ప్రాజెక్టుకు నీళ్లు ఇస్తాయి? ప్రధానమైన అభ్యంతరాలను, సమస్యలను పరిష్కరించకుండా ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడం సరికాదు' అని తెలంగాణ ప్రభుత్వం తప్పుబడుతున్నది.

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఏపీ ప్రభుత్వం ఆక్రమించడం, దౌర్జన్యంగా నీటిని మళ్లించుకోవడం వెనక భారీ కుట్రనే దాగి ఉన్నదని తెలుస్తున్నది. ఈ ఘటన సాకుతో ఉమ్మడి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవాలని కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. తెలంగాణ ఎన్నికల హడావుడిలో నిమగ్నమైన తరుణాన్ని అదునుగా తీసుకుని, ఏపీని ఎగదోసి ఆ దిశగా పావులు కదుపుతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టుల నిర్వహణపై కేంద్రం ఆది నుంచీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ జలహక్కులను కాలరాస్తూ, ఏపీకి వత్తాసు పలికేలా నిర్ణయాలను తీసుకుంటున్నది. కృష్ణా, గోదావరి జలాల పంపిణీ కోసం ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 85 ప్రకారం కేంద్రం కేఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీలను ఏర్పాటు చేసింది. సెక్షన్ 87ప్రకారం బోర్డుల పరిధిని నిర్ణయిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీచేయాల్సి ఉన్నది. అప్పుడే కృష్ణా, గోదావరి నదులపై ఇరు రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులు బోర్డుల ఆధీనంలోకి వెళ్తాయి. అంటే ఆయా ప్రాజెక్టుల నిర్వహణ, నీటి విడుదలతోపాటు విద్యుత్తు ఉత్పత్తి వంటి అంశాలన్నీ బోర్డుల నియంత్రణలోనే కొనసాగుతాయి. అయితే ఇరు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ పూర్తి చేయకుండా, ఆపరేషన్ ప్రొటోకాల్‌ను రూపొందించకుండా ప్రాజెక్టులను అప్పగించేది లేదని తెలంగాణ పట్టుబడుతూ వస్తున్నది. దీంతో కేంద్రం గెజిట్‌ను జారీచేయకుండా వాయిదా వేస్తూ వచ్చింది. కానీ, పలుమార్లు ఏపీ లేఖలు రాయడంతో కేంద్రం కనీసం తెలంగాణతో సంప్రదింపులు జరపకుండానే ఆగమేఘాల మీద 2021 జూన్15న కృష్ణా, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుల గెజిట్‌ను విడుదల చేసింది. కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల నియంత్రణ, పరిపాలన విధివిధానాలకు సంబంధించి మార్గదర్శకాలను అందులో పేర్కొన్నది.

కొలిక్కిరాని ఆపరేషన్ ప్రొటోకాల్

గెజిట్ అమలులో భాగంగా కేంద్ర జల సంఘం నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి విద్యుత్తు ఉత్పత్తికి ప్రొటోకాల్, ఉమ్మడి ప్రాజెక్టుల రూల్ కర్వ్స్, డ్యామ్ సేఫ్టీ తదితర అంశాలకు సంబంధించిన డ్రాఫ్ట్‌ను రూపొందించింది. దానిపై అధ్యయనం చేసి సిఫారసులు చేయాలని కేఆర్ఎంబీకి సూచించింది. అందులో భాగంగా కేఆర్ఎంబీ గతంలో రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ)ని ఏర్పాటు చేసింది. కమిటీలో కేఆర్ఎంబీ మెంబర్ (పవర్), ఇరు రాష్ట్రాల ఈఎన్సీలు, టీఎస్‌జెన్‌కో హైడల్ పవర్, ఏపీ జెన్‌కో హైడల్ పవర్ చీఫ్ ఇంజినీర్లు మొత్తం 6 మంది సభ్యులున్నారు. సీడబ్ల్యూసీ రూపొందించిన రూల్ కర్వ్స్, ఆపరేషన్ ప్రొటోకాల్ అంశాలపై ఈ కమిటీ చర్చించింది. అయితే డ్రాఫ్ట్‌లోని అనేక అంశాలపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం ముమ్మాటికీ జలవిద్యుత్తు ప్రాజెక్టేనని వాదించింది. విద్యుత్తు ఉత్పత్తి, క్యారీ ఓవర్, వరదజలాల మళ్లింపు తదితర అంశాలపై సీడబ్ల్యూసీ ప్రతిపాదనలను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోమని తెలంగాణ తేల్చిచెప్పింది. ఆర్ఎంసీ ప్రతిపాదనలను తప్పుబట్టింది. కానీ, ఆర్ఎంసీ రూపొందించిన ఆ రిపోర్టుపై ఏపీ ప్రభుత్వం మాత్రం సంతకం చేసింది. తెలంగాణ సంతకం చేయకపోవడంతో పెండింగ్‌లోనే ఉండిపోయింది.

కృష్ణా బోర్డు పరిధిలో 10 ప్రాజెక్టులు

కేఆర్ఎంబీ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం గతంలోనే బోర్డు పరిధికి సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కేఆర్ఎంబీ పరిధిలో మొత్తం 36 ప్రాజెక్టులుంటే, ఇందులో తెలంగాణలో నివే 21 ప్రాజెక్టులు ఉన్నాయి. ఏపీకి చెందినవి 15 ప్రాజెక్టులు మాత్రమే ఉన్నాయి. ఇక 8ప్రాజెక్టులు ఉమ్మడిగా ఉన్నాయి. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌తోపాటు జూరాల, ఆర్డీఎస్, సుంకేసుల బ్యారేజీ, నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్, లోలెవల్ కెనాల్స్, కృష్ణా నదిపై ఉన్న ఇతర అన్ని ప్రాజెక్టులు, వాటి పరిధిలోని రిజర్వాయర్లు, కాలువలను బోర్డు పరిధిలోకి తీసుకొస్తున్నట్టు స్పష్టం చేసింది. ఆయా ప్రాజెక్టులకు వచ్చే ఇన్‌ఫ్లో, వివిధ ఔట్‌లెట్లు, గేట్ల ద్వారా విడుదల చేసే ఔట్‌ఫ్లోను బోర్డే పర్యవేక్షిస్తుందని వెల్లడించింది. ఆయా ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టు, దానికి అవసరమైన నీటి లెక్కల ఇండెంటును సీజన్లవారీగా బోర్డులకు రాష్ట్రాలు సమర్పించాలని, ప్రాజెక్టుల ఆపరేషన్స్, మెయింటనెన్స్‌కు నిధులు రాష్ట్రాలే చెల్లించాలని, టెలిమెట్రీల ఏర్పాటుకు నిధులనూ సమకూర్చాలని ఆ డ్రాఫ్ట్‌లో స్పష్టం చేసింది. ప్రాజెక్టులతోపాటు వాటికి అనుబంధంగా ఉన్న కాలువలు, చెరువులు కూడా ఈ బోర్డుల పరిధిలోకి తీసుకోవడం గమనార్హం. దీంతో తెలంగాణలో సాగునీటి వసతి మొత్తం కేంద్రం చేతిలోకి వెళ్లిపోనున్నది. జ్యురిస్‌డిక్షన్ వస్తే బోర్డు చైర్మన్, మెంబర్ సెక్రటరీ, మెంబర్లు, ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లష్కర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ స్టాఫ్, అటెండర్లు కలిపి కృష్ణా బోర్డుకు 328 మంది అవసరమవుతారని అంచనా వేశారు. వారిలో 90 శాతానికిపైగా స్టాఫ్‌ను రెండు రాష్ట్రాలే సమకూర్చాల్సి ఉంటుంది. బోర్డు నిర్వహణకు ప్రస్తుతం ఏడాదికి రూ.3 కోట్ల వరకు ఖర్చవుతుండగా, జ్యురిస్‌డిక్షన్ నోటిఫై చేశాక ఇంజినీర్లు, సెక్యూరిటీ స్టాఫ్‌తో కలుపుకుంటే నిర్వహణ వ్యయం రూ.100 కోట్లకు చేరే అవకాశమున్నది. అదేవిధంగా ఆయా ప్రాజెక్టుల భద్రతను కేంద్ర బలగాలు పర్యవేక్షించనున్నాయి.

రేపు ఇరు రాష్ట్రాలతో కేంద్రజలశక్తిశాఖ భేటీ

సాగర్ డ్యామ్ ఆక్రమణ నేపథ్యంలో వివాదం పరిష్కారానికి కేంద్ర జల్‌శక్తిశాఖ రేపు (బుధవారం) మరోసారి ఇరు రాష్ట్రాలతో భేటీ కానున్నది. ఇప్పటికే ఒక దఫా సమావేశాన్ని నిర్వహించగా, ఎన్నికల నేపథ్యంలో 5వ తేదీ తరువాత సమావేశం నిర్వహించాలని కేంద్ర జల్‌శక్తిశాఖకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి విజ్ఞప్తి చేశారు. దీంతో 6వ తేదీన మరోసారి సమావేశం నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సమావేశంలో కృష్ణా జలాల పంపిణీ వివాద పరిష్కారం, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్వహణ అంశాలపై కూలంకషంగా చర్చిస్తామని వెల్లడించింది.

'పది' ఫీజు చెల్లింపునకు గడువు 7కి పెంపు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): పదోతరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు గడువును అధికారులు మరోసారి పొడిగించారు. తాజాగా ఈ నెల 7 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఇచ్చారు. రూ.50 ఆలస్యరుసుముతో ఈ నెల 14 వరకు, 200 ఆలస్యరుసుముతో 21 వరకు, 500 ఆలస్య రుసుముతో జనవరి 3 వరకు ఫీజు చెల్లించవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫలితాలు విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహించగా, తాజాగా ఫలితాలను వెల్లడించారు. పదోతరగతిలో 35.69%, ఇంటర్మీడియట్‌లో 53.37% మంది పాసయ్యారు. ఫలితాలకు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టాస్ డైరెక్టర్ పీవీ శ్రీహరి తెలిపారు. మార్కుల మెమోలను 15 రోజుల్లో విద్యాసంస్థలకు పంపిస్తామని చెప్పారు. 7 నుంచి 16 వరకు రీ వెరిఫికేషన్ కమ్ రీ కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఫలితాల వివరాలిలా..

తరగతి	హాజరైనవారు	పాసైన వారు	పాస్ పర్సంటేజ్
పదో తరగతి	11,357	4,053	35.69
ఇంటర్మీడియట్	15,348	8,191	53.37

ఎంపీసీ చదివినా డాక్టర్ కావొచ్చు!

- నీట్ యూజీ దరఖాస్తుకు అవకాశం కల్పించనున్న ఎన్‌ఎంసీ

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఎంపీసీ చదివినా డాక్టర్ కావొచ్చు.. ఆశ్చర్యంగా అనిపించినా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిర్ణయం మేరకు ఇది సాకారం కానున్నది. ఇంటర్‌లో ఎంపీసీ తీసుకొన్నామని.. మెడిసిన్ చదివి డాక్టర్ అయితే బాగుండు అని చాలామంది బాధపడుతుంటారు. ఇలాంటి విద్యార్థులకు ఎన్‌ఎంసీ తీపికబురు అందించింది. ఎంపీసీ చదివినా నీట్ యూజీ పరీక్ష రాసేందుకు అనుమతి ఇచ్చింది. గతంలో ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ చదివినవారికే నీట్ రాసే అవకాశం ఉండేది. తర్వాత, బయోటెక్నాలజీ చదివిన వారికీ అవకాశం కల్పించారు. తాజాగా మ్యాథ్స్ చదివిన విద్యార్థులకూ అనుమతి ఇచ్చింది. అయి తే, వారు ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివి ఉండాలని, ఏదేని గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ లేదా బయోటెక్నాలజీని అదనపు సబ్జెక్టుగా తీసుకొని, ఉత్తీర్ణులు కావాలని నిబంధన విధించింది. వీరు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులు చేసేందుకు అర్హులని స్పష్టంచేసింది. వచ్చే నీట్ యూజీ నోటిఫికేషన్ నుంచే అవకాశం కల్పించనున్నట్టు సమాచారం.

సాగర్ డ్యామ్‌పై యథాతథస్థితిని కొనసాగించండి

- కేఆర్ఎంబీకి తెలంగాణ మరో లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ డ్యామ్‌పై నవంబర్ 28వ తేదీకి ముందున్న రీతిలో యథాతథస్థితిని కొనసాగేలా చూడాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కు తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేఆర్ఎంబీకి రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్ సోమవారం మరోసారి లేఖ రాశారు. సాగర్ డ్యామ్‌ను ఏపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఆక్రమించడంతో విషయాన్ని వెంటనే ప్రభుత్వం కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లింది. కేంద్ర హోంశాఖ సైతం తక్షణమే స్పందించి డ్యామ్ ఆక్రమణను తొలగించి పూర్వపుస్థితిని పునరుద్ధరించాలని ఇరు రాష్ట్రాలకు సూచించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ తాజాగా మరోసారి కేఆర్ఎంబీకి లేఖ రాసింది. డ్యామ్ కంట్రోల్‌ను తెలంగాణకు అప్పగించి, పూర్వస్థితిని కొనసాగించేలా సత్వరమే చర్యలు చేపట్టాలని కోరింది.

సాగర్ నుంచి 5టీఎంసీలు ఇవ్వండి

- కేఆర్ఎంబీకి ఏపీ ప్రతిపాదన

నాగార్జునసాగర్ నుంచి 5 టీఎంసీలను విడుదల చేయాలని కేఆర్ఎంబీని ఏపీ సర్కారు కోరింది. కేఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ రాయపురేకు ఏపీ జల వనరులశాఖ ఈఎన్సీ నారాయణరెడ్డి ప్రతిపాదనలు పంపించారు. డ్యామ్‌ను దురాక్రమించి, కుడికాలువ ద్వారా నీళ్లను దౌర్జన్యంగా తరలించుకుపోయిన ఉదంతంపై తెలంగాణ ఫిర్యాదుతో కేంద్ర జలశక్తిశాఖ జోక్యం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీటి విడుదలకు సంబంధించి ఏపీ ఇచ్చిన ఇండెంటుపై సమావేశమై నిర్ణయం తీసుకోవాలని కేఆర్ఎంబీ చైర్మన్ శివనందన్‌ను ఆదేశించారు. త్రిసభ్య కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ హాజరుకాలేదు. దీంతో తెలంగాణ అభిప్రాయం తీసుకున్న అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఏపీకి కేఆర్ఎంబీ తెలిపినట్టు సమాచారం.

హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి కొత్త పేటెంట్

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ యూనివర్సిటీ మరో కొత్త పేటెంట్‌ను దక్కించుకున్నది. మొక్కలలో వ్యాధి నిరోధకాలుగా వ్యవహరించే 'బౌమాన్-బిర్క్, కునిట్జ్' ఇన్హిబిటర్లను వేరుచేసి శుద్ధీకరించే విధానానికి గాను ఈ పేటెంట్ లభించింది. స్కూల్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ కే పద్మశ్రీ, డాక్టర్ ఎంకే అరుణశ్రీలు ఈ విధానాన్ని అభివృద్ధి చేశారు. వీరికి మరియమ్మ గుజ్జర్లపూడి, భారతి కొటార్యా సహకరించారు. ప్రొఫెసర్ పద్మశ్రీ మాట్లాడుతూ.. మొక్కలలో ఉండే బౌమన్-బిర్క్, కునిట్జ్ ఇన్హిబిటర్లు పలు జీవసంబంధమైన విధులు నిర్వహిస్తాయని తెలిపారు. అవి మొక్కలను వ్యాధికారకాలు, తెగుళ్ల నుంచి రక్షిస్తాయని చెప్పారు. ముఖ్యంగా పత్తి, పల్లి, వంకాయ, టమాట, క్యాప్సికం, ఆముదం తదితర పంటలకు సోకే లెపిడోప్టెరన్, హెలికోవర్పా వంటి తెగుళ్ల నుంచి కాపాడుతాయని వివరించారు.

బొటానికల్ గార్డెన్‌లో కాప్ కార్నర్

- 52 కొత్త జాతుల మొక్కలు నాటిన యూఏఈ

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ కాన్సులేట్ జనరల్ 52వ జాతీయ దినోత్సవం సందర్భంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 'కాప్ - 28 సమ్మిట్'ను తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించింది. బొటానికల్ గార్డెన్‌లో లేని 52 కొత్త జాతుల మొక్కలను 'కాప్-28 కార్నర్' పేరుతో నాటారు. ఈ సందర్భంగా యూఏఈ హైదరాబాద్ కాన్సుల్ జనరల్ ఆరిఫ్ అల్నుయిమి యూఏఈ జాతీయ వృక్షం జమ్మి చెట్టును నాటారు. తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో కలిసి కాప్-28 కార్నర్‌ను నిర్వహించడం సంతోషంగా ఉన్నదని ఆరిఫ్ అల్నుయిమి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు టీఎస్ఎఫ్‌డీసీకి యూఏఈ కాన్సుల్ అన్ని వేళల సహకరిస్తుందని అన్నారు. అనంతరం టీఎస్ఎఫ్‌డీసీ వీసీ, ఎండీ డాక్టర్ జీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బొటానికల్ గార్డెన్‌లో ఏడాది కాలంలోనే 1500 రకాల జాతులను నాటినట్టు చెప్పారు.

గుండెపోటుతో జనగామ జడ్పీ చైర్మన్ మృతి

- చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన పాగాల సంపత్‌రెడ్డి
- తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు
- జోడు పదవులు అప్పగించిన బీఆర్ఎస్
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి
- కుటుంబానికి అండగా ఉంటాం: కేటీఆర్



జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరంలో జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి

జనగామ/హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): జనగామ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి (55) సోమవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. హనుమకొండలోని తన నివాసంలో చాయ్ తాగిన కొద్దిసేపటికే గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడిగా బీఆర్ఎస్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఉద్యమంలో ముందుండి పోరాడిన సంపత్‌రెడ్డి సేవలను గుర్తించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జనగామ జడ్పీ చైర్మన్‌గా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా జోడు పదవులను కట్టబెట్టారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత సోమవారం మధ్యాహ్నం స్టేషన్‌ఘన్‌పూర్‌లో తొలిసారి నిర్వహించిన మీడియా సమావేశంలో సంపత్‌రెడ్డి పాల్గొని అందరితో కలివిడిగా గడిపారు. కడియం గెలుపు సంబురాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్న ఆయన స్వీట్లు పంచి ఉత్సాహంగా కనిపించిన కొద్దిసేపటికే కానరాని లోకాలకు వెళ్లడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయి. పాగాల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. ఆయ నకు భార్య సుజాతారెడ్డి, కూతురు సంజనారెడ్డి ఉన్నారు. కుమారుడు సాయిరెడ్డి 2010 జూన్ 26న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో సంపత్‌రెడ్డి మానసికంగా బాగా కుంగిపోయారు.

కేసీఆరే దైవంగా..

తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ అంటే సంపత్‌రెడ్డికి ఎంతో ఇష్టం.. ఆయన్ను దైవంగా భావిస్తారు. ఉద్యమ సమయంలో సంపత్‌రెడ్డిపై 28 కేసులు నమోదయ్యాయి. 2001లో పార్టీలో చేరిన సంపత్‌రెడ్డి 2002 నుంచి 2006 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా యువజన విభాగం ప్రచార కార్యదర్శిగా, 2006 నుంచి 2013 వరకు స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా, 2013 నుంచి 2015 వరకు స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2019 జూలై 5న చిల్పూరు జడ్పీటీసీగా ఎన్నికైన సంపత్‌రెడ్డి సేవలను గుర్తించిన కేసీఆర్ ఆయన్ను జనగామ జడ్పీ చైర్మన్‌గా ఎంపిక చేశారు. 2022 జనవరి 26న జనగామ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు చేపట్టారు.

సంపత్‌రెడ్డి మృతిపట్ల కేసీఆర్ దిగ్భ్రాంతి

సంపత్‌రెడ్డి హఠాన్మరణంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతికి గురయ్యారు. తెలంగాణ ఉద్యమం తొలినాళ్ల నుంచి తన వెంట నడిచిన యువనేత సంపత్‌రెడ్డి మరణం బాధాకరమని అన్నారు. పాగాల మృతిపట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. దుఃఖంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంపత్‌రెడ్డి మరణం పార్టీకి తీరనిలోటు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సంతాపం తెలిపారు. జనగామ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

ఒకేసారి డిగ్రీ, పీజీ పూర్తిచేసే చాన్స్

- భారత్‌లో మూడేండ్లు.. అమెరికాలో రెండేండ్లు
- అమెరికాలోని ఐదు వర్సిటీలతో జేఎన్టీయూ ఒప్పందం
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి..

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : విద్యార్థి ఏదైనా కోర్సును స్వదేశంలో లేదంటే విదేశాల్లో చదువుకోవచ్చు. కానీ, ఒకే కోర్సును స్వదేశంతో పాటు, విదేశాల్లో చదువుకొనే అవకాశాన్ని హైదరాబాద్‌లోని జేఎన్టీయూ కల్పిస్తున్నది. విద్యార్థులు ఒకేసారి బీటెక్, ఎంటెక్ రెండు కోర్సులను పూర్తిచేసుకోవచ్చు. బీటెక్, ఎంటెక్ కోర్సుల నిర్వహణకు జేఎన్టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్‌హుస్సేన్‌లు ఇటీవలే అమెరికాలోని న్యూజెర్సీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లారెన్స్ టెక్నాలజికల్ యూనివర్సిటీ, ఎంఎస్‌వోయూ, అలబామా యూనివర్సిటీ, స్టీవెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. మన దగ్గర ఎంసెట్, పీజీఈసెట్, గేట్ ర్యాంకుల ద్వారా బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నారు. ఈ విధానంలో ఎంసెట్ ద్వారా బీటెక్‌లో ప్రవేశాలు పొందిన వారు పీజీఈసెట్, గేట్‌లతో సంబంధం లేకుండా ఎంటెక్‌లో అడ్మిషన్లు పొందవచ్చు.

ఐదేండ్లలో బీటెక్, ఎంటెక్..

మన దగ్గర బీటెక్ నాలుగేండ్లు, ఎంటెక్ రెండేండ్లు పడుతున్నది. కానీ డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లో భాగంగా బీటెక్, ఎంటెక్ కోర్సులను ఐదేండ్లలోనే పూర్తిచేయొచ్చు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త కోర్సులను జేఎన్టీయూ అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ కోర్సుల్లో చేరిన వారు మొదటి మూడేండ్లు బీటెక్ డిగ్రీని జేఎన్టీయూలో, బీటెక్ చివరి సంవత్సరాన్ని అమెరికాలో, ఎంటెక్‌ను కూడా అమెరికాలోనే చదివే అవకాశం కల్పిస్తారు.

ఇప్పటికే రెండు వర్సిటీల్లో..

ఇప్పటికే జేఎన్టీయూ.. అమెరికాలోని రెండు యూనివర్సిటీల భాగస్వామ్యంతో డ్యూయల్ డిగ్రీ కోర్సులు విజయవంతంగా నడుస్తున్నాయి. అమెరికాలోని సెంట్రల్ మిచిగాన్ యూనివర్సిటీలో ఎంబీఏ, స్వీడన్‌లోని బ్లికింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్) సహకారంతో ఐదేండ్ల మాస్టర్స్ డిగ్రీ కోర్సులను నిర్వహిస్తున్నారు.

డాక్టర్ రాజ్యలక్ష్మికి